సాక్షి నల్లగొండ

సోమవారం ׀ 4 ׀ డిసెంబర్ ׀ 2023



యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదాద్రిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీకమాసం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు.



వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు.




నేడు జిల్లాస్థాయి క్రీడాపోటీలు

మునగాల: సూర్యాపేటలో సోమవారం అండర్ -14, 17 ఉమ్మడి జిల్లాస్థాయి షూటింగ్ బాల్, టెన్నికాయిట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.



చౌటుప్పల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల విజయోత్సాహం



హస్తం హవా

12 స్థానాలకు 11 సీట్లు గెలుపొందిన కాంగ్రెస్





కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్లగొండ



రాజగోపాల్‌రెడ్డి, మునుగోడు



ఉత్తమ్ కుమార్‌రెడ్డి, హుజూర్‌నగర్



పద్మావతి, కోదాడ



అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. ప్రజలు హస్తం అభ్యర్థులకే బ్రహ్మరథం పట్టడంతో జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా నిలిచింది. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉండగా, 11 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయ దుందుభి మోగించారు. కాంగ్రెస్ పార్టీకి వచ్చిన జోష్‌లో అధికార బీఆర్‌ఎస్ ఒక్క స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో నిన్నటి వరకు ఒక్క స్థానం కూడా లేని కాంగ్రెస్ పార్టీ.. పడిలేచిన కెరటంగా ఉవ్వెత్తున ఎగిసింది. ఇక ఈ ఎన్నికలో సీపీఎం అన్ని స్థానాల్లోనూ డిపాజిట్లు కోల్పోగా బీజేపీ కేవలం ఒక్క స్థానంలోనే డిపాజిట్ దక్కించుకుంది.

అధికార పార్టీని మట్టి కరిపించిన కాంగ్రెస్

2018 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 9 స్థానాల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించగా, మూడు స్థానాల్లో గెలుపొందిన కాంగ్రెస్.. 2019 ఉప ఎన్నికల్లో ఒక స్థానాన్ని కోల్పోయింది. మరోవైపు నకిరేకల్ నుంచి గెలుపొందిన చిరుమర్తి లింగయ్య బీఆర్‌ఎస్‌లో చేరగా, మునుగోడు నుంచి గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 2022లో రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీంతో ఉప ఎన్నికలు వచ్చాయి. వాటిల్లోనూ రాజగోపాల్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాల్వాయి స్రవంతి ఓడిపోయారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. దీంతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క స్థానం కూడా లేకుండా పోయింది. అలాంటి పరిస్థితి నుంచి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఉవ్వెత్తున లేచింది. ప్రస్తుతం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. జిల్లా మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి తప్ప మిగిలిన 11 స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు చిత్తుగా చేతిలో ఓడిపోయారు.

సీన్ రివర్స్

నిన్నటి వరకు జిల్లాలో 12 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉండి, కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే లేకపోగా.. ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు ఒకే ఒక్క ఎమ్మెల్యే స్థానం దక్కగా 11 మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే గెలిచారు. పైగా వారంతా 20 వేల నుంచి 60వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రస్తుత విజయంతో కాంగ్రెస్ ఉమ్మడి జిల్లాలో తిరుగులేని పార్టీగా అవతరించింది.

కాంగ్రెస్ కోటగా..

ఒకప్పుడు నల్లగొండ జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా నల్లగొండ జిల్లాలో మాత్రం అత్యధికంగా కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉత్తమ్ దంపతులతోపాటు కోమటిరెడ్డి బ్రదర్స్, జానారెడ్డిలు విజయం సాధిస్తూ వస్తుండేవారు. టీడీపీ హయాంలోనూ జిల్లాలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఉమ్మడి జిల్లా నుంచి 2009లో ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉండగా ముగ్గురు టీడీపీ, ఒకరు సీపీఐ, ఒకరు సీపీఎం ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక 2014కు వచ్చే సరికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య ఐదుకు తగ్గిపోయింది. 2018లో ముగ్గురు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచినా 2023 వచ్చేసరికి ఒక్కరూ లేకుండాపోయారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ 2009 నాటి పరిస్థితికి కంటే అధిక సీట్లను సాధించింది. 11 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచి కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా నిలిపారు. ఇక కమ్యూనిస్టులు తమ ఉనికి కోల్పోయారు. ఏడు చోట్ల పోటీ చేసినా కనీసం డిపాజిట్ దక్కలేదు. ఒకప్పుడు కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్నా ఇప్పుడు ఆ పార్టీ ఆదరణ కోల్పోయింది.

11 చోట్ల సమీప ప్రత్యర్థి మినహా మరెవరికీ దక్కని డిపాజిట్

ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో 15 నుంచి 39 మంది వరకు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఒక్క సూర్యాపేట మినహా మిగతా 11 నియోజకవర్గాల్లో సమీప ప్రత్యర్థులు మినహా మరెవ్వరికీ డిపాజిట్ దక్కలేదు.

బీజేపీకి ఒక్క స్థానంలోనే డిపాజిట్

జిల్లాలో కోదాడ మినహా 11 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీలో నిలిచారు. సూర్యాపేటలో పోటీ చేసిన సంకినేని వెంకటేశ్వర్‌రావు మాత్రమే డిపాజిట్ దక్కించుకున్నారు. మిగతా 10 నియోజకవర్గాల్లో బీజేపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులకు కనీసం డిపాజిట్ దక్కలేదు. జాతీయ నేతలు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వచ్చి ప్రచారం చేసినా డిపాజిట్ దక్కించుకోలేని స్థితిలో ఆ పార్టీ పడింది.

- కాంగ్రెస్ కంచుకోటగా ఉమ్మడి నల్లగొండ జిల్లా
- మునుపెన్నడూ లేని విధంగా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- ఒక్క స్థానంతో సరిపెట్టుకున్న బీఆర్‌ఎస్
- జగదీష్‌రెడ్డి మినహా.. సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా ఓటమి
- ఒక్కచోట మాత్రమే డిపాజిట్ దక్కించుకున్న బీజేపీ
- పోటీచేసిన ఏడు స్థానాల్లోనూ డిపాజిట్ కోల్పోయిన సీపీఎం



బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ




బీర్ల ఐలయ్య, ఆలేరు



బాలూ నాయక్, దేవరకొండ



వేముల వీరేశం, నకిరేకల్



మొత్తంగా పార్టీల వారీగా వచ్చిన ఓట్ల శాతం



జైవీర్‌రెడ్డి, నాగార్జునసాగర్



మందుల సామేలు, తుంగతుర్తి

ఒకే ఒక్కడు..

- ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ నుంచి జగదీష్‌రెడ్డి ఒక్కరే గెలుపు
- సూర్యాపేటలో 1967 తర్వాత హ్యాట్రిక్ సాధించిన మొదటి వ్యక్తి



గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్‌ఎస్ నుంచి ఒకే ఒక్కడు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి గెలుపొందారు. ఆయనకు వరుసగా మూడో సారి విజయం వరించింది. 1967 తర్వాత జరిగిన ఎన్నికల్లో సూర్యాపేట నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ సాధించిన మొదటి వ్యక్తిగా రికార్డుకెక్కారు. 1952, 1957లో ఉప్పల మల్సూర్ సూర్యాపేట ద్విసభ్య నియోజకవర్గ ఎమ్మెల్యేగా, 1962, 1967లో మరో రెండుసార్లు గెలిచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఘనత సాధించారు. ఆ తర్వాత ఆకారపు సుదర్శన్ రెండుసార్లు 1989,1994లో గెలుపొందారు. ఇక జగదీష్‌రెడ్డి వరుసగా 2014, 2018, 2023లో గెలుపొంది హ్యాట్రిక్ వీరుడిగా ఘనత సాధించారు. అదే విధంగా ఉమ్మడి జిల్లాలో 1994లో 12 స్థానాలకు గాను 11 స్థానాల్లో తెలుగుదేశం, మిత్రపక్షాలు గెలుపొందగా.. తుంగతుర్తి స్థానంలో మాత్రం రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా గెలుపొంది ఒకే ఒక్కడిగా నిలిచారు. ప్రస్తుతం 12 స్థానాలకు 11 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందగా.. సూర్యాపేటలో మాత్రమే జగదీష్‌రెడ్డి గెలిచి ఒకే ఒక్కడిగా రికార్డు కెక్కారు.

నోటాకు 11,297 ఓట్లు

ఉమ్మడి జిల్లాలో నోటాకు భారీగానే ఓట్లు పోలయ్యాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో మొత్తం 11,297 ఓట్లు నోటాకు వచ్చాయి. భువనగిరి నియోజకవర్గంలో 882, ఆలేరు 659, సూర్యాపేట 760, నకిరేకల్ 969, తుంగతుర్తి 1,351, మునుగోడు 849, నాగార్జునసాగర్ 1,056, మిర్యాలగూడ 527, కోదాడ 887, హుజూర్‌నగర్ 843, దేవరకొండ 1,613, నల్లగొండలో 901 ఓట్లు పడ్డాయి.



నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు

ప్రజలు చరిత్రాత్మక తీర్పునిచ్చారు : ఉత్తమ్

హుజూర్‌నగర్: తెలంగాణ ప్రజలు చరిత్రాత్మక తీర్పునిచ్చారని హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం మీద అసంతృప్తితోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు చెప్పిన మాటలను ప్రజలు నమ్మలేదని పేర్కొన్నారు. వందశాతం సామరస్యంగా మంచి వాతావరణంలో ముందుకు పోతామని తెలిపారు. ముందు నుంచీ చెప్పినట్టుగానే హుజూర్‌నగర్, కోదాడలో భారీ మెజార్టీతో గెలిచామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సహకరించిన సీపీఐ, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సోనియాగాంధీకి పుట్టిన రోజు కానుక : కోమటిరెడ్డి

నల్లగొండ : రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి తెలంగాణను ఇచ్చిన సోనియాగాంధీకి ప్రజలు పుట్టిన రోజు కానుక ఇచ్చారని నల్లగొండ ఎమ్మెల్యేగా గెలుపొందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి బాధ్యత మరింత పెంచారని అన్నారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా పేదలకు ఇళ్లు, ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణవెల్లెంల పూర్తి, మూసీ ప్రాజెక్టు ప్రక్షాళన చేపడతామన్నారు. నల్లగొండ స్మార్ట్ సిటీకి రూ.219 కోట్లు మంజూరైనా ఇప్పటి వరకు టెండర్లు పిలవలేదని, రూ.వంద కోట్లతో రోడ్డు వేసి రూ.1300 కోట్లు నల్లగొండకు ఇచ్చామని కేటీఆర్ అంటున్నారని.. ఇప్పుడు ఆయన మంజూరు లెటర్ ఇస్తే.. టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాన్నారు. నల్లగొండకు ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మిస్తామని.. ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేస్తానన్నారు.

నియోజకవర్గాల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు..

నియోజకవర్గం	పోలైన ఓట్లు	గెలిచిన అభ్యర్థి (ఓట్లు)	సమీప అభ్యర్థి (ఓట్లు)
నాగార్జునసాగర్	2,02,088	జయవీర్ (1,19,831)	భగత్ (63,982)
నకిరేకల్	2,19,033	వీరేశం (1,33,540)	లింగయ్య (64,701)
నల్లగొండ	2,04,027	వెంకట్‌రెడ్డి (1,07,405)	భూపాల్‌రెడ్డి (53,073)
మునుగోడు	2,33,608	రాజగోపాల్‌రెడ్డి (1,19,624)	ప్రభాకర్‌రెడ్డి (79,034)
దేవరకొండ	2,13,881	బాలునాయక్ (1,11,344)	రవీంద్రకుమార్ (81,323)
మిర్యాలగూడ	1,93,741	లక్ష్మారెడ్డి (1,14,462)	భాస్కర్‌రావు (65,680)
సూర్యాపేట	2,06,669	జగదీశ్‌రెడ్డి (75,143)	దామోదర్‌రెడ్డి (70,537)
తుంగతుర్తి	2,25,170	సామేల్ (1,29,535)	కిషోర్‌కుమార్ (78,441)
హుజూర్‌నగర్	2,15,298	ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (1,16,707)	సైదిరెడ్డి (71,819)
కోదాడ	2,08,992	పద్మావతిరెడ్డి (1,25,783)	మల్లయ్యయాదవ్ (67,611)
ఆలేరు	2,12,761	ఐలయ్య (1,22,140)	సునీత (72,504)
భువనగిరి	1,96,077	అనిల్‌కుమార్‌రెడ్డి (1,02,742)	శేఖర్‌రెడ్డి (76,541)

ఐదు చోట్ల 50 వేలకుపైగా మెజారిటీ

ఉమ్మడి జిల్లాలో 68 వేల ఓట్ల ఆధిక్యంతో వేముల వీరేశం రికార్డ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అత్యధిక మెజారిటీ సాధించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 నియోజకవర్గాలకు గాను 11 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. వారిలో ఐదుగురు 50 వేలకు పైగా మెజారిటీ సాధించారు. మరో నలుగురు 40 వేలకు పైగా మెజారిటీ సాధించారు. ఇద్దరు 20 వేలకు పైగానే మెజారిటీ సాధించారు. సూర్యాపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి ఉమ్మడి జిల్లాలోనే అత్యల్పంగా 4,606 ఓట్ల మెజారిటీ లభించింది.

ఉమ్మడి జిల్లాలో సరికొత్త రికార్డు

నకిరేకల్‌నుంచి గెలుపొందిన వేముల వీరేశం 68,839 ఓట్ల మెజారిటీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యపై విజయం సాధించారు. 1952 నుంచి జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఎవరూ ఇంత మెజారిటీ సాధించలేదు. తొలిసారిగా వేముల వీరేశం 68,839 ఓట్ల మెజారిటీ సాధించి రికార్డు నెలకొల్పారు.

50 వేలకుపైగా మెజారిటీ..

కోదాడలో నలమాద పద్మావతిరెడ్డి 58,172 ఓట్ల మెజారిటీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్‌పై గెలుపొందారు. నాగార్జునసాగర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్‌పై కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జయవీర్‌రెడ్డి 55,849 ఓట్ల మెజారిటీ సాధించారు. నల్లగొండలో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 54,332 ఓట్ల మెజారిటీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డిపై విజయం సాధించారు. తుంగతుర్తిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌పై కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ 51,094 ఓట్ల మెజారిటీ సాధించారు. ఇక ఆలేరులో బీర్ల ఐలయ్య 49,636, మిర్యాలగూడలో బత్తుల లక్ష్మారెడ్డి 48,782, హుజూర్‌నగర్‌లో నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి 44,888, మునుగోడులో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 40,590, దేవరకొండలో నేనావత్ బాలునాయక్ 30,021, భువనగిరిలో కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి 26,201 ఓట్ల మెజారిటీ సాధించారు.



నల్లగొండలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

రెండోసారి జంటగా అసెంబ్లీకి ఉత్తమ్ దంపతులు



కోదాడ : టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆయన సతీమణి పద్మావతిరెడ్డి జంటగా మరోసారి అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. 2014 ఎన్నికల్లో కోదాడ నుంచి పద్మావతి, హుజూర్‌నగర్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శాసనసభ్యులుగా గెలుపొంది అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. 2018లో కోదాడలో పద్మావతి ఓడిపోగా.. హుజూర్‌నగర్‌లో ఉత్తమ్ గెలుపొందారు. తాజాగా 2023 ఎన్నికల్లో కోదాడ నుంచి పద్మావతిరెడ్డి గెలుపొందగా, హుజూర్‌నగర్ నుంచి ఉత్తమ్ మరోసారి విజయం సాధించారు. అయితే ఈ ఎన్నికల్లో వీరిద్దరూ రికార్డు స్థాయి మెజార్టీతో విజయం సాధించడం గమనార్హం.

ఉమ్మడి జిల్లా నుంచి ఈసారి ఏకైక మహిళా ఎమ్మెల్యేగా పద్మావతిరెడ్డి

కోదాడ : తాజా ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి గెలుపొందిన ఏకైక మహిళా ఎమ్మెల్యేగా కోదాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి నిలవనున్నారు. గత ఎన్నికల్లో ఆలేరు నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన గొంగిడి సునీత ప్రాతినిత్యం వహించారు. తాజా ఎన్నికల్లో ఆమె కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య చేతిలో ఓటమి పాలుకాగా.. కోదాడ నుంచి పద్మావతిరెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌పై రికార్డుస్థాయి మెజార్టీతో విజయం సాధించారు. అయితే 2014 ఎన్నికల్లో మల్లయ్యయాదవ్‌పై విజయం సాధించిన పద్మావతి, 2018 ఎన్నికల్లో మల్లయ్య చేతిలో 756 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. ఆ తరువాత 2019 హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డిపై పోటీ చేసి ఓటమి చవిచూశారు. తాజాగా కోదాడ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లయ్యను ఓడించి అసెంబ్లీకి అడుగుపెడుతున్నారు.

కాంగ్రెస్‌తోనే రాజగోపాల్‌రెడ్డికి విజయాలు

చౌటుప్పల్ : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి రాజకీయంగా కాంగ్రెస్ పార్టీతోనే కలిసివస్తుందని చెప్పవచ్చు. ఆయన 2009లో రాజకీయరంగ ప్రవేశం చేశారు. మొదటిసారి అదే సంవత్సరంలో భువనగిరి ఎంపీ స్థానం నుంచి పోటీ విజయం సాధించారు. తిరిగి 2014లో అదే పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తరువాత 2015లో స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేసి గెలుపొందారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా మునుగోడు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2022లో కాంగ్రెస్ పార్టీకి, తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అదే ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. ఈ ఎన్నికల ముందు మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చి ప్రస్తుతం మునుగోడు నుంచి విజయం సాధించారు. ఆయన సాధించిన విజయాలన్నీ చూస్తే రాజగోపాల్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీనే రాజకీయంగా కలిసివచ్చింది.

ఏడాదికే మాజీ అయిన కూసుకుంట్ల



చౌటుప్పల్ : మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఏడాదికే మాజీ అయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. ప్రభాకర్‌రెడ్డి మునుగోడు నుంచి 2014లో టీఆర్‌ఎస్ తరఫున బరిలోకి దిగి సీపీఐ అభ్యర్థి పల్లా వెంకట్‌రెడ్డిపై విజయం సాధించారు. తిరిగి 2018లో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. 2022లో రాజగోపాల్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో నవంబర్‌లో వచ్చిన ఉప ఎన్నికలో 10,113ఓట్ల తేడాతో రాజగోపాల్‌రెడ్డిపై గెలుపొందారు. ఏడాది మాత్రమే ఎమ్మెల్యేగా పదవిలో ఉన్న కూసుకుంట్ల.. ప్రస్తుతం ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు.

మూడోసారి పునరావృతం

● రాష్ట్రంలో అధికార పార్టీ.. సూర్యాపేటలో ప్రతిపక్షం

సూర్యాపేట: సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 1967 నుంచి జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే.. సూర్యాపేటలో కూడా అదే పార్టీ అభ్యర్థి గెలుపొందే ఆనవాయితీ కొనసాగింది. కానీ.. 1989లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగా సూర్యాపేటలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆకారపు సుదర్శన్ గెలుపొందారు. అలాగే 1999లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగా ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దోసపాటి గోపాల్ గెలుపొందారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టబోతుండగా.. సూర్యాపేటలో మాత్రం బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పటిదాకా రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టే సూర్యాపేటలో కూడా గెలుపొందుతుందని అనేక ఊహాగానాలు ఉన్నప్పటికీ ఈ సారి ఫలితం తారుమారైంది.

ఐదోసారి కోమటిరెడ్డి విజయం

నల్లగొండ : నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఐదోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1999, 2004, 2009, 2014 ఎన్నికల్లో వరుసగా నాగులు సార్లు విజయం సాధించిన ఆయన 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. అనంతరం 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో నల్లగొండ నుంచి పోటీ చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డిపై 54,332 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నల్లగొండ స్థానం నుంచి కోమటిరెడ్డి మొత్తం ఐదు సార్లు విజయం సాధించారు.



ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రంలో ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది



నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది



రిటర్నింగ్ అధికారి చేతులమీదుగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



కౌంటింగ్ కేంద్రంలో ఆలింగనం చేసుకున్న దామోదర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి




నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రంలో ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది, ఓట్ల వివరాలు నమోదు చేసుకుంటున్న ఆయా పార్టీల ఏజెంట్లు



విజయ సంకేతం చూపుతున్న బత్తుల లక్ష్మారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

తొలిసారి అసెంబ్లీకి..



కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



బీర్ల అయిలయ్య



మందుల సామేల్



కుందూరు జయవీర్‌రెడ్డి



బత్తుల లక్ష్మారెడ్డి

సాక్షి, యాదాద్రి, తిరుమలగిరి, హాలియా : భువనగిరి, ఆలేరు, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, తుంగతుర్తి నియోజకవర్గాల నుంచి గెలుపొందిన అభ్యర్థులు తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. వీరంతా కాంగ్రెస్‌పార్టీ నుంచే విజయం సాధించడం విశేషం.

✦ వలిగొండ మండల కేంద్రానికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. అనిల్‌కుమార్‌రెడ్డి 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. అయినా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన పైళ్ల శేఖర్‌రెడ్డిపై విజయం సాధించి తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

✦ యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామానికి చెందిన బీర్ల అయిలయ్య తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌నాయకునిగా



పని చేసిన అయిలయ్య సైదాపురం పాల సొసైటీ చైర్మన్‌గా, సైదాపురం సర్పంచ్‌గా, యాదగిరిగుట్ట ఎంపీటీసీగా పని చేశారు.

✦ తుంగతుర్తి నుంచి పోటీ చేసిన మందుల సామేల్ తొలిసారి విజయం సాధించారు. చివరి నిమిషం టికెట్ దక్కించుకున్న సామేల్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌పై 51,094 భారీగా మెజార్టీతో విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు.

✦ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు కుందూరు జయవీర్‌రెడ్డి 41 వయస్సులో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి బరి నుంచి తప్పుకుని ఆయన వారసుడైన కుందూరు జయవీర్‌రెడ్డిని పోటీలో నిలిపారు. ఈ ఎన్నికల్లో కుందూరు జయవీర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

✦ మిర్యాలగూడ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌ను చివరి నిమిషంలో దక్కించుకున్న బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్‌ఆర్) బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావుపై భారీ మెజార్టీతో విజయం సాధించారు. బత్తుల లక్ష్మారెడ్డి ఇప్పటికే మిర్యాలగూడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారి అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు.

అలా పార్టీ మారి.. ఇలా గెలిచారు

సాక్షి, యాదాద్రి, నకిరేకల్, చౌటుప్పల్, తిరుమలగిరి : కొద్ది రోజుల వ్యవధిలోనే పార్టీ మారి కాంగ్రెస్ టికెట్ సాధించిన పలువురు నేతలు ఈ ఎన్నికల్లో విజయం సాధించారు. వీరిలో నకిరేకల్ నుంచి గెలిచిన వేముల వీరేశం, మునుగోడు నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, తుంగతుర్తి నుంచి మందుల సామేల్, భువనగిరి నుంచి గెలుపొందిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

● భువనగిరి ఎమ్మెల్యేగా గెలిచిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆగస్టులో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎన్నికల ముందు తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చారు. వెంటనే కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కించుకున్న ఆయన బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డిపై 26 వేల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు.

◆ గతేడాది బీజేపీలో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఈ ఏడాది అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన రోజే కాంగ్రెస్ నుంచి మునుగోడు టికెట్ దక్కించుకున్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీపై 40 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించి అందరినీ ఆకర్షించారు.

◆ గతంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా, గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రెండుసార్లు పని చేసిన మందుల సామేల్ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. చివరి నిమిషంలో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌ను మందుల సామేల్‌కు కేటాయించింది. సామేల్ 51,093 మెజార్టీతో ఘన విజయం సాధించారు.

❖ నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వేముల వీరేశం 2014లో టీఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. కానీ 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య చేతిలో ఓడిపోయారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో చిరుమర్తి లింగయ్య బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుత ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన చిరుమర్తి లింగయ్యకు బీఆర్‌ఎస్ అధిష్టానం టికెట్ ఇచ్చింది. దీంతో భంగపాటుకు గురైన వేముల వీరేశం సెప్టెంబర్ 28న కాంగ్రెస్ పార్టీలో చేరారు. నకిరేకల్ టికెట్ కోసం కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది పోటీ పడినా.. చివరకు వేముల వీరేశానికే అధిష్టానం టికెట్ కేటాయించింది. ఈ ఎన్నికల్లో ఆయన 68వేల పైచిలుకు మెజార్టీతో చిరుమర్తి లింగయ్యపై ఘన విజయం సాధించారు.

కోమటిరెడ్డి బ్రదర్స్ ఏకకాలంలో అసెంబ్లీకి..

● అన్నదమ్ములిద్దరూ ఒకేసారి ఎమ్మెల్యేలుగా గెలిచింది ఈ ఎన్నికల్లోనే..



సాక్షి, యాదాద్రి: కోమటిరెడ్డి సోదరులు ఎమ్మెల్యేలుగా ఒకేసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. 1999 నుంచి నల్లగొండ ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, 2018 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 2009లో భువనగిరి ఎంపీగా విజయం సాధించిన సమయంలో వెంకట్‌రెడ్డి నల్లగొండ ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే, 2014 ఎన్నికల్లో భువనగిరి ఎంపీ స్థానానికి పోటీచేసి రాజగోపాల్‌రెడ్డి ఓడిపోయారు. ఆ వెంటనే వచ్చిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. ఆ సమయంలో వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యేగా, రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉన్నారు. 2018 ఎన్నికల్లో వెంకట్‌రెడ్డి నల్లగొండ అసెంబ్లీ నుంచి ఓడిపోగా.. రాజగోపాల్‌రెడ్డి మునుగోడు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2019లో వెంకట్‌రెడ్డి భువనగిరి ఎంపీగా గెలుపొందారు. 2022లో రాజగోపాల్‌రెడ్డి బీజేపీలో చేరి మునుగోడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగా ఉపఎన్నిలో ఓడిపోయారు. ఈ ఎన్నికలకు ముందు రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి మునుగోడు నుంచి గెలుపొందగా, వెంకట్‌రెడ్డి నల్లగొండ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇద్దరు సోదరులు ఏకకాలంలో అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు.

ఆరు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీగా ఉత్తమ్

హుజూర్‌నగర్: ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా విజయఢంకా మోగించిన నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. గతంలో కోదాడ ఎమ్మెల్యేగా రెండు సార్లు, హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా మూడు సార్లు గెలిచిన ఆయన ప్రస్తుతం 6వ సారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా మూడు సార్లు, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత వరుసగా మూడు సార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన ఎమ్మెల్యేగా ఉండగానే నల్లగొండ ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతూనే మళ్లీ హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు.

నాలుగు దశాబ్దాల తర్వాత కాంగ్రెస్ గెలుపు



అనిల్‌కుమార్‌రెడ్డిని పూలమాలతో సన్మానిస్తున్న కార్యకర్తలు

సాక్షి, యాదాద్రి : భువనగిరి ఖిలాపై నాలుగు దశాబ్దాల తరువాత మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగిరింది. ప్రస్తుతం ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డిపై విజయం సాధించారు. చివరిసారిగా 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున కొమ్మిడి నర్సింహారెడ్డి విజయం సాధించారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎలిమినేటి మాధవరెడ్డి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆయన వరుసగా 1999 వరకు నాలుగుపర్యాయాలు గెలుపొందుతూ వచ్చారు. 2000 సంవత్సరంలో మాధవరెడ్డి మరణంతో వచ్చిన ఉప ఎన్నికలో ఆయన సతీమణి ఎలిమినేటి ఉమామాధవరెడ్డి బరిలో నిలిచారు. వరుసగా మూడు దఫాలు విజయం సాధించిన ఆమె.. 2014లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. తాజా విజయంతో కాంగ్రెస్ రికార్డు సృష్టించింది.

కేంద్ర బలగాల ఆధీనంలో సాగర్ డ్యాం



13వ గేటు వద్ద తొలగించిన కంచె

నాగార్జునసాగర్: సాగర్ డ్యాం కేంద్ర బలగాల ఆధీనంలోకి వెళ్లింది. రెండు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న జల వివాదం కేంద్ర ప్రభుత్వ జోక్యంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. నాలుగు రోజులుగా కుడికాల్వకు విడుదలవుతున్న నీటిని శనివారం అర్ధరాత్రి నిలిపివేశారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల అంగీకారం మేరకు డ్యాం ఈ నెల 6వ తేదీ వరకు సీఆర్‌పీఎఫ్ పోలీసుల పహారాలో ఉండనుంది. ఏపీ అధికారులు డ్యాం 13వ గేటు వద్ద వేసిన బారికేడ్స్, ముళ్లకంచెను తొలగించారు. డ్యాంపై మోహరించిన పోలీస్ దళాలు ఖాళీ చేశాయి. ఖాళీ చేసే ముందు.. ఎస్‌పీఎఫ్ దళాలకు ఆంధ్రా పోలీసులకు కాసేపు గొడవ జరిగింది. సాగర్‌డ్యాం ఎస్‌ఈ నాగేశ్వర్‌రావు, డీఈలు దగ్గరుండి వారికి నచ్చజెప్పి ఖాళీ చేయించారు.

నియంత పాలనకు చరమగీతం

● కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



నల్లగొండ: తెలంగాణ ప్రజలు నియంత పాలనకు చరమగీతం పాడి కొత్త చరిత్ర సృష్టించారని మునుగోడు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రంలో ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నియంత పాలనతో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారన్నారు. తాను ఏ ఆశయంతో అయితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పోరాటం చేశానో ఆ ఆశయం బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఓటమితో నెరవేరిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ఆరోపించారు.

దేవరకొండ ప్రజలకు రుణపడి ఉంటా

● నేనావత్ బాలునాయక్



దేవరకొండ : శాసనసభ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో తనను గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని దేవరకొండ ఎమ్మెల్యే గా గెలుపొందిన నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆది వారం నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నిరంకుశత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తామని తెలిపారు. తన గెలుపునకు కృషిచేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు కర్రుకాల్చి వాత పెట్టారు

● మందుల సామేల్



తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులను విస్మరించిన బీఆర్‌ఎస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టారని తుంగతుర్తి ఎమ్మెల్యే గా గెలుపొందిన మందుల సామేల్ అన్నా రు. ఆదివారం ఓట్ల లెక్కింపు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తి ప్రజల ఆశీర్వాదంతో అత్యధిక మెజార్టీతో విజయం సాధించానని తెలిపారు. రాష్ట్రంలో రాచరిక పాలన సాగిందని ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు పక్కాగా అమలు చేస్తుందని తెలిపారు.

అవినీతి పాలన అంతం

● వేముల వీరేశం



నల్లగొండ: బీఆర్‌ఎస్ అవినీతి పాలనను తెలంగాణ ప్రజలు అంతం చేశారని నకిరేకల్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన వేముల వీరేశం అన్నారు. నల్ల గొండలోని కౌంటింగ్ సెంటర్ వద్ద ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా కేసీఆర్‌ను కలిసే పరిస్థితి లేదన్నారు. ప్రజలను కలవని సీఎం ప్రజా వ్యతిరేకతకు గురై కాంగ్రెస్ ప్రభంజనంలో కొట్టుకుపోయాడన్నారు. ఈ నియంత పాలనకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారన్నారు.

ఆలేరు ప్రజలు మార్పు కోరుకున్నారు

● బీర్ల ఐలయ్య



యాదగిరిగుట్ట: ఆలేరు ప్రజలు మార్పు కోరుకున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన బీర్ల ఐలయ్య అన్నారు. అరోరా కళాశాలలో కౌంటింగ్ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ఆలేరు ఆగమైందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను నమ్మి ఆలేరు ప్రజలు మంచి మెజార్టీని ఇచ్చారన్నారు. ఆలేరు అండర్‌పాస్, రెవెన్యూ డివిజన్, నూతన మండలాలు, యాదాద్రి ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

ఆరు గ్యారంటీలే గెలిపించాయి

● కుందూరు జయవీర్‌రెడ్డి



హాలియా: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకే పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొచ్చాయని నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలోని కౌంటింగ్ హాల్ నుంచి బయటకు వచ్చిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు 30వేల మెజార్టీ వస్తుందని ఆశించానని ప్రజలు మాత్రం 56వేల మెజార్టీని అందించారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలు కచ్చితంగా అందేలా చూస్తామన్నారు. తన గెలుపు కోసం శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

● బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ: నియోజకవర్గ ప్రజలందరికి అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యేగా గెలుపొందిన బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై అభిమానంతో మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలు తన గెలుపు కోసం కృషిచేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఇక ముందు కూడా కొనసాగిస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఇది చరిత్రాత్మక విజయం

● కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



సాక్షి యాదాద్రి: భువనగిరి నియోజకవర్గంలో 40 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ గెలవడం చరిత్రాత్మకమని భువనగిరి ఎమ్మెల్యేగా గెలుపొందిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరిలోని కౌంటింగ్ సెంటర్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. అందరి సమష్టి కృషితోనే ఈ గెలుపు సాధ్యమైంది. ఎన్నికలకు ముందు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ భువనగిరికి వచ్చి ప్రచారం చేయడం కలిసి వచ్చింది. కాంగ్రెస్ 6 గ్యారంటీలను అమలు చేస్తాం.

ఈ విజయం కోదాడ ప్రజలకు అంకితం

● పద్మావతిరెడ్డి



కోదాడ: నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు తన విజయాన్ని అంకితమిస్తానని కోదాడ ఎమ్మెల్యేగా గెలుపొందిన పద్మావతిరెడ్డి అన్నారు. సూర్యాపేట కౌంటింగ్ సెంటర్ వద్ద ఆమె మాట్లాడుతూ.. తన గెలుపునకు సహకరించిన టీడీపీ, సీపీఐ నేతలు, ముదిరాజ్ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వేనేపల్లి చందర్‌రావు, ఎర్నేని బాబు, మహబూబ్‌జానీ, పాండురంగారావు తదితరులు సహకారంతోనే తన గెలుపు సాధ్యమైందన్నారు.